క్లుప్తంగా

10లోగా పంట నమోదు పూర్తి చేయాలి



సిబ్బందికి సూచనలిస్తున్న ఏఓ రవిప్రకాష్

కోడుమూరు రూరల్: మండలంలో రబీ కింద రైతులు సాగు చేసిన పంటల నమోదును ఈనెల 10వ తేదీలోగా పూర్తి చేయాలని మండల వ్యవసాయాధికారి రవిప్రకాష్ సిబ్బందిని ఆదేశించారు. సోమవారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో మండలంలోని రైతు సేవా కేంద్రాల సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పంట నమోదుతోపాటు రైతుల కేవైసీని కూడా పూర్తి చేయాలన్నారు. ఆయా గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో సిబ్బంది రైతులకు అందుబాటులో ఉండి పంటల సాగుకు అవసరమైన సలహాలు ఇవ్వాలని సూచించారు.

ఖతాదారులకు నాణ్యమైన సేవలు



నూతన భవనంలో పూజలు చేస్తున్న బ్యాంకు సిబ్బంది

పాణ్యం: ఖాతాదారులకు మరింత మెరుగ్గా సేవలందించేందుకు కృషి చేస్తున్నట్లు జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ శ్రీనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. పాణ్యంలోని అమ్మవారిశాల వద్ద ఉన్న కేడీసీసీ బ్యాంక్‌ను సోమవారం స్టేట్ బ్యాంక్ వద్ద నూతనంగా నిర్మించిన భవనంలోకి మార్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు, ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించే దిశగా పాణ్యం బ్రాంచ్‌లో డిపాజిట్లపై అధిక వడ్డీ రేట్లు చెల్లిస్తున్నట్లు చెప్పారు. బ్యాంకు మేనేజర్ టి.రవి కుమార్, సిబ్బంది, సహకార సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులతో ఆరోగ్యం



ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేసిన కూరగాయలను విక్రయిస్తున్న దృశ్యం

కల్లూరు: ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండించిన కూరగాయలు, ఆకుకూరలను తీసుకుని ఆరోగ్యంగా ఉందామని జిల్లా ప్రాజెక్టు మేనేజర్ చంద్రశేఖర్ సూచించారు. సోమవారం కల్లూరు మండల పరిషత్ కార్యాలయం వద్ద ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్‌ను నిర్వహించారు. మండలంలో పండించిన కూరగాయలను విక్రయించారు. ఈ స్టాల్‌ను జిల్లా ప్రాజెక్టు మేనేజర్ చంద్రశేఖర్, ఏఈఓ డేవిడ్, సందీప్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రాజెక్టు మేనేజర్ మాట్లాడుతూ.. కూరగాయలు కొనుగోలు చేయడానికి వచ్చే ప్రజలకు, అధికారులకు ప్రకృతి వ్యవసాయం గురించి అవగాహన కల్పించాలన్నారు. ఈ విధానంలో పండించిన కూరగాయలను తినడం వల్ల కలిగే ఉపయోగాలు వివరించాలన్నారు. మండల ఇన్‌చార్జ్ షేక్ మబువలి, సిబ్బంది పాల్గొన్నారు.

డిజిటల్ క్లాస్ రూమ్ పనుల పరిశీలన



డిజిటల్ క్లాస్ రూమ్ పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ రంజిత్ బాషా

కర్నూలు (టౌన్): ఈ నెల 8వ తేదీ లోపు వర్చువల్ ఇంటరాక్టివ్ డిజిటల్ క్లాస్ రూమ్ పనులను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా ఆదేశించారు. సోమవారం సాయంత్రం స్థానిక సుంకేసుల రోడ్డులోని మున్సిపల్ కౌన్సిల్ హాలులో డిజిటల్ క్లాస్ రూమ్ పనులను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఈనెల 9వ తేదీ రాష్ట్ర విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ డిజిటల్ క్లాస్‌రూమ్‌ను ప్రారంభించనున్నారన్నారు. ఇందుకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న పార్టిషన్, సీలింగ్, ఇంటర్నెట్ సదుపాయం, కంప్యూటర్ ఏర్పాటు వంటి పనులన్నీ త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆర్ అండ్ బీ ఎస్ఈ, జిల్లా విద్యాశాఖ అధికారిని ఆదేశించారు. అలాగే పాఠశాలల్లో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విద్యా బోధనకు వీలుగా ఇంటర్నెట్ కనెక్షన్ స్పీడ్‌లో ఎలాంటి సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, నగరపాలక కమిషనర్ రవీంద్రబాబు, జిల్లా విద్యాశాఖాధికారి పాల్, ఆర్ అండ్ బీ ఎస్ఈ మహేశ్వర రెడ్డి పాల్గొన్నారు.

ఆధార్ నమోదుకు అవస్థలు

- సి.బెళగల్‌లో తాత్కాలిక ఆధార్ క్యాంపు ఏర్పాటు
- బాలఆధార్ నమోదుకు పిల్లలను తీసుకురావాలని అంగన్‌వాడీలకు ఆదేశం
- ఎంపీడీఓ కార్యాలయం వద్దకు వెళ్లాక కేంద్రం మార్చినట్లు సమాచారం
- సచివాలయం-2 వద్ద ఆలస్యంగా ప్రారంభమైన ప్రక్రియ
- పిల్లలు, తల్లులు గంటల కొద్దీ వేచివున్న వైనం





బాల ఆధార్ నమోదు కోసం సి.బెళగల్ సచివాలయం వద్ద పడిగాపులు కాస్తున్న చిన్నారులు, తల్లులు

సి.బెళగల్: మండల కేంద్రం సి.బెళగల్‌లో బాల ఆధార్ నమోదు కోసం బాలింతలు, పిల్లల తల్లీదండ్రులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. మండలంలో శాశ్వత ఆధార్ కేంద్రం లేకపోవడం, తాత్కాలిక కేంద్రాల ఏర్పాటులో అధికారుల సమన్వయ లోపంతో ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ముందస్తు ప్రణాళికలు లేకుండ బాలింతలను, మహిళలను అక్కడికి ఇక్కడికి అంటూ కార్యాలయాలా చుట్టూ తిప్పుతూ వారి సహనాన్ని పరీక్షిస్తున్నారు. ప్రజల సేవలపట్ల అధికారుల నిర్లక్ష్యంపై పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు. అదే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో సచివాలయాల వద్దే ఆధార్ సేవలు అందించే వారని గుర్తుచేసుకుంటున్నారు.

గంటల కొద్దీ పడిగాపులు

మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం వద్ద ఆధార్ నమోదు శిబిరం ఏర్పాటు చేశారని సున్నా నుంచి ఆరు సంవత్సరాలలోపు వయసున్న శిశువులకు కొత్త ఆధార్ నమోదుకు (బాల ఆధార్) తీసురావాలని ఐసీడీఎస్ సి.బెళగల్ సెక్టార్ సూపర్‌వైజర్ మల్లేశ్వరి అంగన్‌వాడీ టీచర్లను ఆదేశించారు. దీంతో వారు సోమవారం సి.బెళగల్‌లోని ఆరు అంగన్‌వాడీ కేంద్రాల నుంచి బాలింతలు తమ శిశువులను, తల్లిదండ్రులు చిన్నారులను తీసుకుని ఉదయం 9.30 గంటలకు మండల పరిషత్ కార్యాలయానికి చేరుకున్నారు. అక్కడ గంటసేపు వేచి వున్నారు. 10.30 గంటల అనంతరం సూపర్‌వైజర్ వచ్చి బాల ఆధార్ నమోదుకు సి.బెళగల్ గ్రామ సచివాలయం- 2లో చేపడతారని అక్కడకు వెళ్లాలని ఆధార్‌కోసం వచ్చిన వారిని పంపించారు. దీనితో చిన్న పిల్లలతో బాలింతలు, మహిళలు, చిన్నారుల తండ్రులు సి.బెళగల్ గ్రామ సచివాలయం - 2కు చేరుకున్నారు. అయితే ఆధార్ నమోదు సిబ్బంది సచివాలయంలో లేకపోవడంతో చిన్నారులతో అవస్థలు పడుతూ అక్కడే పడిగాపులు కాశారు. మధ్యాహ్నం 12 గంటలకు ఆధార్ నమోదు సిబ్బంది సచివాయానికి చేరుకుని నమోదు ప్రక్రియను ప్రారంభించారు.

ఆధార్ నమోదుకు తప్పని తిప్పలు

అధికారులు సరైన సమాచారం ఇవ్వకుండా బాలింతలను, మహిళలను అక్కడికి ఇక్కడికి అంటూ తిప్పి, గంటల కొద్ది వేచిఉండేలా చేయడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మండలంలో ఆధార్ నమోదుకు తిప్పలు పడాల్సి వస్తుందని, శాశ్వత ఆధార్ కేంద్రం ఏర్పాటు చేసిన ఆధార్ సేవలను సక్రమంగా అందేలా జిల్లా అధికారులు చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

కబడ్డీ విజేత విశాఖపట్టణం



ట్రోఫీ అందుకుంటున్న విశాఖ బాలుర జట్టు

కర్నూలు (టౌన్): నగర శివారులోని కేఈ నివాసం సమీపంలో ఈనెల 3వ తేదీ నుంచి నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి బాలబాలికల కబడ్డీ పోటీలు ఆదివారం రాత్రి ముగిశాయి. ఈ టోర్నమెంటులో బాలుర విభాగంలో విశాఖపట్టణం జట్టు విజేతగా కర్నూలు జట్టు రన్నర‌ప్‌గా, అలాగే బాలికల విభాగంలో విశాఖపట్టణం జట్టు విజేతగా కర్నూలు జట్టు రన్నరప్‌గా నిలిచాయి. మూడవ స్థానంలో చిత్తూరు జట్టు, నాలుగవ స్థానంలో అనంతపురం జట్లు నిలిచాయి. విజేతలకు కప్పును మాజీ మంత్రి కేఈ ప్రభాకర్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విజేతలుగా నిలిచిన జట్లు ఈనెల 8 నుంచి 11వ తేదీ వరకు ఉత్తరాఖండ్‌లోని హరిద్వార్‌లో నిర్వహించనున్న జాతీయ స్థాయి కబడ్డీ టోర్నమెంటులో పాల్గొంటారని తెలిపారు. కబడ్డీ రాష్ట్ర కార్యదర్శి పద్మజ, కేడీసీసీ మాజీ చైర్మన్ మల్లికార్జున రెడ్డి, మాజీ కార్యదర్శి రాజశేఖర్, కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి సుధాకర్ పాల్గొన్నారు.

పాఠశాలల అభివృద్ధికి సహకరించాలి



తిమ్మందొడ్డిలో ఎస్ఎంసీ సభ్యులకు శిక్షణ ఇస్తున్న హెచ్ఎం నాగేశ్వరమ్మ

సి.బెళగల్: పాఠశాలల అభివృద్ధికి ఎస్ఎంసీ సభ్యులు సహకరించాలని పాఠశాలల హెచ్ఎంలు కోరారు. సోమవారం మండలంలోని పాఠశాలల్లో ఎస్ఎంసీ చైర్మన్, వైస్ చైర్మన్, సభ్యులకు పాఠశాల నిర్వహణ విధానాలు, ఎస్ఎంసీ సభ్యుల పాత్ర, సహకారాలపై ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. తిమ్మందొడ్డి పాఠశాలలో హెచ్ఎం నాగేశ్వరమ్మ మాట్లాడుతూ.. పాఠశాలల అభివృద్ధికి స్థానికులు, విద్యార్థుల తల్లిదండ్రుల సహకారం చాలా అవసరమన్నారు. పాఠశాలల అభివృద్ధిలో ఎస్ఎంసీ సభ్యులు భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా సి.బెళగల్‌లోని రెగ్యులర్ స్కూల్లో హెచ్ఎం కిషోర్‌కుమార్, స్పెషల్ స్కూల్లో ఈడీ సరోజ, గుండ్రేవుల ఎస్సీ కాలనీ స్కూల్లో హెచ్ఎం ఈశ్వరయ్య, కంబదహాల్ మేయిన్ స్కూల్లో హెచ్ఎం నాగన్న, బ్యాతోలిలో హెచ్ఎం సోమశేఖర్ తదితరులు శిక్షణ ఇచ్చారు.

కత్తెర పురుగు నివారణకు చర్యలు తీసుకోండి



ఇనగండ్ల వద్ద మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న ఏడీఏ వెంకటేశ్వర్లు, రైతులు

సి.బెళగల్: రైతులు రబీ సీజన్‌లో సాగు చేసిన మొక్క జొన్న పంట సంరక్షణకు తగు జాగ్రత్తలు, సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని కర్నూలు వనరుల కేంద్రం (డీఆర్‌సీ) ఏడీఏ వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం ఆయన మండల వ్యవసాయ అధికారి (ఏఓ) మల్లేష్‌కుమార్, డీఆర్‌సీ ఏఓ శశిధర్ రెడ్డి, మండల వ్యవసాయ సిబ్బందితో కలిసి మండల పరిధిలోని ఇనగండ్ల, గుండ్రేవుల గ్రామాల్లో పర్యటించి పంటలను పరిశీలించారు. మొక్కజొన్న పంటలో కత్తెర పురుగును గుర్తించారు. నివారణ చర్యలను రైతులకు వివరించారు. మొక్కజొన్నలో కత్తెర పురుగు నివారణకు ఎకరాకు 10 లింగాకర్షక బుట్టాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. అదేవిధంగా తొలి దశలో ఒక లీటరు నీటికి ఐదు మిల్లీ లీటర్ల వేప కషాయం కలిపి పిచికారీ చేసుకోవాలని సూచించారు. రెండవ దశలో ఇమామెక్టిన్ బెంజోయేట్ మందును లీటరు నీటికి 0.4 గ్రాముల చొప్పున లేదా, స్పైనోసాడ్ 0.3 మిల్లీ లీటర్లు కలిపి పిచికారీ చేయాలన్నారు. అలాగే ఎకరాకు 10 కేజీల తౌడు, రెండు కేజీల బెల్లం, 10 గ్రాముల థయోడీకార్బ్‌ను కలిపిన మిశ్రమాన్ని కలిపి చిన్నచిన్న ఉండలుగా తయారు చేసుకుని మొక్కజొన్న మొక్క సుడులలో వేసినట్లెయితే కత్తెర పురుగును నివారించుకోవచ్చని చెప్పారు. వీఏఏలు ఆసీఫ్, ఈశ్వర్, రైతులు నరసింహుడు, తిమ్మప్ప తదితరులు ఉన్నారు.

అనుమతులున్న మందులనే విక్రయించాలి

పెస్టిసైడ్స్, ఫర్టిలైజర్ దుకాణాల యజమానులు ప్రభుత్వ అనుమతులున్న ఎరువులు, పురుగు మందులు, విత్తనాలను మాత్రమే అమ్మాలని కర్నూలు వనరుల కేంద్రం ఏడీఏ వెంకటేశ్వర్లు సూచించారు. సోమవారం ఆయన మండల కేంద్రంలోని పలు ఎరువులు, పురుగు మందులు, విత్తన దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఏఓ మల్లేష్‌కుమార్, డీఆర్‌సీ ఏఓ శశిధర్‌రెడ్డి, ఎంపీఈఓ వెంకటేశ్వర్లు ఉన్నారు.

సత్తా చాటిన జిల్లా అథ్లెట్లు



రాష్ట్రస్థాయి క్రాస్ కంట్రీ పోటీల్లో పతకాలు సాధించిన కర్నూలు అథ్లెట్లు

కర్నూలు (టౌన్): పశ్చిమగోదావరి జిల్లా తణుకు మండలం వేల్పూరులో ఈనెల 5వ తేదీన నిర్వహించిన 59వ రాష్ట్రస్థాయి క్రాస్ కంట్రీ చాంపియన్‌షిప్ పోటీల్లో కర్నూలు అథ్లెట్లు ప్రతిభ చాటారు. అండర్-16 విభాగంలో కె.మనీష్ (కాంస్యం), బాలికల విభాగంలో టి.లక్ష్మీకాంతి (వెండి పతకం), అండర్-20 బాలుర విభాగంలో ఎస్.షేక్షావలి (వెండి పతకం), బి.వెంకటేష్ (నాలుగవ స్థానం), అండర్-20 బాలికల విభాగంలో ఎం.ప్రసన్నకుమారి (వెండి పతకం), బి.వీణకుమారి (ఐదవ స్థానం), డి.వెంకటేశ్వరి (నాలుగవ స్థానం) సాధించారు. రాష్ట్రస్థాయిలో ప్రతిభ చాటిన వీరంతా ఉత్తరప్రదేశ్‌లోని మీరట్‌లో నిర్వహించనున్న జాతీయస్థాయి క్రాస్ కంట్రీ పోటీలకు ఎంపికైనట్లు ఎస్‌జీఎఫ్ అండర్-19 జిల్లా కార్యదర్శి హర్షవర్ధన్ వెల్లడించారు.

మద్యం షాపును తొలగించాలి



మద్యం షాపు వద్ద ఆందోళన చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

ఓర్వకల్లు: మండల కేంద్రంలో జనజీవనానికి ఇబ్బందిగా మారిన ప్రైవేట్ మద్యం షాపును తొలగించాలని సీపీఎం, సీపీఐ మండల కార్యదర్శులు నాగన్న, రమేష్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక మద్యం దుకాణం ఎదురుగా నిరసన కార్యక్రమం నిర్వహించి, ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామంలో నంది కొట్కూరుకు వెళ్లే ప్రధాన రహదారి పక్కనే మద్యం షాపును నిర్వహించడం వల్ల అటుగా రాకపోకలు సాగించే జనజీవనానికి అసౌకర్యంగా మారిందన్నారు. ఈ రహదారిలో ప్రతి రోజు వందలాది మంది ప్రజలు, విద్యార్థులు రాకపోకలు సాగిస్తుంటాయని, ఉదయం, సాయంత్రం వేళల్లో వాహనాల రద్దీ అధికంగా ఉండటంతో తీవ్ర ఇబ్బందిగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రధానంగా ఆదివారం క్రైస్తవులు ఈ రహదారిపైనే చర్చికి వెళ్లి వస్తుంటారన్నారు. ఆ సమయంలో మందుబాబులు, ఇతర రాష్ట్రాలకు చెందిన వారు రోడ్డుపైనే తప్పతాగి గొడవలు పడి, బహిరంగ మూత్ర విసర్జన చేయడం వల్ల మహిళలు, విద్యార్థులు, వ్యవసాయ కూలీలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని వివరించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇక్కడున్న మద్యం షాపును తొలగించి, ఊరు వెలుపల ఏర్పాటు చేయాలని కోరారు. లేనిపక్షంలో గ్రామ ప్రజలను ఐక్యం చేసి, ఆందోళన చేపడతామని స్పష్టం చేశారు. రైతు సంఘం మండల కార్యదర్శి సుధాకర్, కేవీపీఎస్ మండల కార్యదర్శి రామకృష్ణ, ఆయా సంఘాల నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

ఆధార్ సేవలను సద్వినియోగం చేసుకోండి

కోడుమూరు రూరల్ : మండలంలోని పులకుర్తి, గోరంట్ల, ప్యాలకుర్తి గ్రామాల్లో నిర్వహిస్తున్న ఆధార్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ రాముడు సోమవారం సూచించారు. 0 నుంచి 6 సంవత్సరాల్లోపు పిల్లలకు ఆయా గ్రామాల్లోని సచివాలయాల్లో ఉచితంగా ఆధార్ నమోదును ఈనెలాఖరు వరకు చేస్తారన్నారు. కావున తల్లిదండ్రులు ఆయా కేంద్రాలను సంప్రదించి తమ పిల్లల పుట్టిన తేదీకి సంబంధించిన ధ్రువ పత్రాలను సమర్పించి ఆధార్ నమోదు చేయించుకోవాలని కోరారు.

రేషన్ డీలర్ల ఇంటర్వ్యూలు వాయిదా

కర్నూలు(రూరల్): కర్నూలు నగరంలో ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం నిర్వహించాల్సిన రేషన్ డీలర్ల ఇంటర్వ్యూలు వాయిదా వేసినట్లు కర్నూలు రెవెన్యూ డివిజన్ అధికారి కిడారి సందిప్ కుమర్ తెలిపారు. కర్నూలు రెవెన్యూ డివిజన్ పరిధిలో 74 రేషన్ డీలర్ల దుకాణాల కోసం 1:5 రేషియోలో 251 అభ్యర్థులు ఇంటర్వ్యూకు పిలిచామన్నారు. తదుపరి తేదీలను త్వరలో ప్రకటిస్తామని పేర్కొన్నారు.

రేషన్ పంపిణీపై విచారణ

కల్లూరు: మండలంలోని కె.మార్కాపురం గ్రామంలో జరుగుతున్న రేషన్ పంపిణీపై డీఎస్ఓ రాజరఘువీర్ విచారణ చేపట్టారు. జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో గ్రామానికి చెందిన పలువురు రేషన్ బియ్యం పంపిణీపై ఫిర్యాదు చేశారు. దీంతో స్పందించిన అధికారులు ఆ గ్రామంలో విచారణ చేపట్టారు. వచ్చే నెల నుంచి గ్రామ సచివాలయం/ ఏదైనా ప్రభుత్వ స్థలంలో రేషన్ పంపిణీ చేయాలని అధికారులను ఆదేశించారు. ఏఎస్ఓ రామాంజనేయ రెడ్డి, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

పాణ్యం: ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని ఎమ్మెల్యే గౌరు చరిత సూచించారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ ఉసేన్ ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజలు లేవనెత్తిన సమస్యలను సత్వరం పరిష్కరించేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. అంతకుముందు పాణ్యం గ్రామ సచివాలయం, హెల్త్ సెంటర్, ఆర్‌బీకే కేంద్రాన్ని ప్రారంభించారు. అలాగే మార్కెట్ యార్డును పరిశీలించారు. త్వరగా శుభ్రం చేసి రైతులకు అందుబాటులో ఉంచాలన్నారు. పాణ్యం సీహెచ్‌సీలో నిర్వహించిన ఆసుపత్రి డెవలప్‌మెంట్ కమిటీ సమావేశంలో పాల్గొని ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్, కో-ఆప్షన్ సభ్యులు జాకీర్‌ఉసేన్, ఎంపీటీసీలు సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టులకు దరఖాస్తు చేసుకోండి

పాణ్యం: మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టులకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ శివారెడ్డి సూచించారు. ఆయన సోమవారం మాట్లాడుతూ.. కళాశాలలో కామర్స్, జువాలజీ, ఎకానామిక్స్ సబ్జెక్టులు బోధించేందుకు గెస్ట్ ఫ్యాకల్టీ నియామకానికి చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. పీహెచ్‌డీ, ఏపీ సెట్, నెట్ అర్హత కలిగిన వారికి ప్రాధాన్యత ఉంటుందని, అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఈ నెల 9వ తేదీన ఉదయం 10 గంటలకు కళాశాలలో హాజరుకావాలని, డెమో నిర్వహించనున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు సెల్ నంబర్ 98660 41775ను సంప్రదించాలన్నారు.

విద్యా ప్రమాణాలు మెరుగుపడాలి



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎస్ఎంసీ రాష్ట్ర పరిశీలకుడు కె.పెంచలయ్య

పాణ్యం: విద్యార్థుల్లో విద్యా ప్రమాణాలు మరింత మెరగుపడాలని ఎస్ఎంసీ రాష్ట్ర పరిశీలకుడు కె.పెంచలయ్య అన్నారు. ఆయన సోమవారం తమ్మరాజుపల్లె, ఆలమూరు గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల తల్లిందడ్రులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. పాఠశాలలో పిల్లలకు అందుతున్న విద్య, పరిశుభ్రత, పౌష్టికాహారం, ఇతర సౌకర్యాలపై తల్లిదండ్రులు పరిశీలించుకోవచ్చన్నారు. విద్యార్థుల్లో విద్యా ప్రమాణాలు తగ్గితే నిర్భయంగా ఉపాధ్యాయులతో మాట్లాడి సమస్యను తెలియజేయాలన్నారు. అంతేగాక పాఠశాలలో మధ్యాహ్నం విద్యార్థులకు అందించే భోజనాన్ని తనిఖీ చేయాలన్నారు. అలాగే గ్రామంలో ఎక్కడైనా డ్రాపౌట్స్ ఉంటే వారిని బడిలో చేర్పించేలా సహకరించాలని కోరారు. ఎంఈఓ-2 సుబ్రమణ్యం, హెచ్ఎంలు పాల్గొన్నారు.

బీడీ కార్మికులకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలి



ఇన్‌చార్జ్ తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

కర్నూలు(రూరల్): జోహరాపురం 19వ వార్డు బీడీ వర్కర్స్ కాలనీ వాసులకు ఒరిజనల్ పట్టాలు ఇవ్వాలని, మౌలిక వసతులు కల్పించాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యురాలు పి.నిర్మల, ఎం.రాజశేఖర్ డిమాండ్ చేశారు. సోమవారం కర్నూలు రూరల్ ఇన్‌చార్జ్ తహసీల్దార్ వెంకటలక్ష్మికి బీడీ కార్మికులు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లడుతూ.. ప్రభుత్వం పేదలకు ఇచ్చిన స్థలాలు అన్యాక్రాంతం కాకుండ పోలీస్, రెవెన్యూ శాఖ వారు రక్షణ కల్పించాలని కోరారు. ఇన్‌చార్జ్ తహసీల్దార్ మాట్లాడుతూ.. ఇళ్ల పట్టాలు హౌసింగ్ శాఖ అధికారుల దగ్గర ఉన్నట్లు మా రికార్డులు తెలుపుతున్నాయన్నారు. వారి దగ్గర లెకుంటే కాలనీని సర్వే చేయించి పొజిషన్‌లో వున్నవారికి పట్టాలు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆవాజ్ కమిటీ నగర అధ్యక్షుడు, పి.ఇక్బాల్, హుస్సేన్, ఎస్.ఎండి. షరీఫ్, కె.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గర్భిణుల ఆరోగ్య జాగ్రత్తలపై శిక్షణ



మాట్లాడుతున్న డాక్టర్ ఎల్.భాస్కర్

కర్నూలు(హాస్పిటల్): గర్భిణులకు దీర్ఘకాలిక వ్యాధులపై అవగాహన కల్పించాలని ఇన్‌చార్జ్ డీఎంహెచ్ఓ డాక్టర్ ఎల్.భాస్కర్ సూచించారు. సోమవారం కర్నూలు మెడికల్ కాలేజీలోని లెక్చరర్ గ్యాలరీలో హైరిస్క్ ప్రెగ్నెన్సీపై ఇంటిగ్రేటెడ్ మేనేజ్‌మెంట్, ట్రాకింగ్‌పై పట్టణ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న వార్డు/గ్రామ మహిళా ఆరోగ్య కార్యకర్తలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణలో డాక్టర్ ఎల్.భాస్కర్ మాట్లాడుతూ.. గర్భిణులకు సంబంధించి దీర్ఘకాలిక వ్యాధులైన రక్తపోటు, షుగర్, కిడ్నీవ్యాధులు, క్షయ, గుండె జబ్బులు, మూర్ఛ, హెపటైటిస్-బి, మలేరియా, గతంలో గర్భం కోల్పోవడం, కవల పిల్లలు, ప్రసూతికి సంబంధించిన శస్త్రచికిత్స, ప్రమాద చిహ్నాలు గల గర్భిణి ఆరోగ్య చరిత్ర గురించి తెలుసుకుని మాతాశిశు సంరక్షణ కార్డులో నమోదు చేయాలని, ఆ విషయాలను వైద్యాధికారి దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. అనంతరం గర్భిణిల్లో ప్రమాదకర పరిస్థితులను ముందుగానే గుర్తించే విధానం గురించి రాష్ట్రస్థాయి శిక్షకులు డాక్టర్ ప్రియాంక, డాక్టర్ శివప్రసాద్, డాక్టర్ అనుదీప్తి పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ నాగప్రసాద్, డీపీఎంఓ డాక్టర్ ఉమా, డీపీహెచ్ఎన్ఓ కె.అన్నపూర్ణ, డీపీఓ విజయ, స్టేట్ ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

మురుగు కాల్వలు నిర్మించాలి



ఎంపీడీఓ శ్రీనివాసులుకు వినతి పత్రం సమర్పిస్తున్న సీపీఐ నాయకులు

ఓర్వకల్లు: మండలంలోని అన్ని గ్రామాలలో మురుగు కాల్వలు నిర్మించి, పారిశుద్ధ్యం లోపించకుండా చర్యలు తీసుకోవాలని సీపీఐ మండల కార్యదర్శి రమేష్ డిమాండ్ చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమంలో సీపీఐ నాయకులు రమేష్, రైతు సంఘం మండల కార్యదర్శి సుధాకర్ తదితరులు ఎంపీడీఓ శ్రీనివాసులును కలిసి పలు రకాల సమస్యలపై వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మండలంలోని గుట్టపాడు, ఉప్పలపాడు, ఉయ్యాలవాడ, లొద్దిపల్లె, నన్నూరు తదితర గ్రామాలలో మురుగు కాల్వలు నిర్మించకపోవడంతో కొళాయి నీరు రోడ్లపై పారుతూ అపరిశుభ్రంగా మారాయన్నారు. కొన్ని చోట్ల మరుగుదొడ్లు లేక మహిళలు బహిర్భూమికి తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోందన్నారు. కొన్ని చోట్ల మరుగుదొడ్లు ఉన్నా నీటివసతి లేక దుర్వాసన వెదజల్లుతోందని చెప్పారు. గ్రామాలలో ఎక్కడ పడితే అక్కడ మంచినీటి పైపులైన్ లీకేజీలు ఏర్పడుతున్నా, వీధి లైట్లు రేయింబవళ్లు వెలుగుతున్నా, నిర్వహణ బాధ్యతలు పట్టించుకొనే వారే కరువయ్యారని వాపోయారు. కనీసం మంచి నీటి ట్యాంకులను శుభ్రం చేయకపోగా, క్లోరినేషన్ చేయకుండా రావాటర్‌ను కొళాయిలకు వదలడంతో ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు గ్రామాలలో పర్యటించి, సమస్యలను పరిష్కరించాలని కోరారు.

● పుడమి తల్లికి పుట్టెడు కోకలు!



గడివేములలో కుందూనది ఒడ్డున దుస్తులను ఉతికి ఆరవేయగా రంగురంగులుగా కనిపిస్తున్న దృశ్యం

పుడమి తల్లికి పుట్టెడు కోకలు అలంకారమయ్యాయి. రంగురంగుల కోకలతో పుడమి తల్లిని ప్రత్యేకంగా అలంకరించినట్లు నేల పులకించింది. గడివేముల సమీపంలోని కుందూ పరివాహక ప్రాంతంలో సోమవారం రజకులు ఉతికి భూమిపై ఆరేసిన చీరలు ఇలా అందంగా కనిపించాయి. – గడివేముల

నిర్లక్ష్యపు తుప్పు



మండల పరిధిలోని గడిగరేవుల జెడ్పీ స్కూల్‌లో గత ప్రభుత్వ హయాంలో నాడు-నేడు పనులు చేపట్టేందుకు కొనుగోలు చేసిన కడ్డీలు తప్పు పడుతున్నాయి. కూటమి ప్రభుత్వ ఏర్పడ్డాక పాఠశాలల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను నిర్లక్ష్యం చేస్తూ ఎక్కడికక్కడ నిలిపివేసింది. దీంతో దాదాపు రూ.లక్ష విలువ చేసే ఇనుప కడ్డీలను పాఠశాల ఆవరణలో నిరుపయోగంగా ఉంచడంతో ఎండకు ఎండి, వానకు నానుతూ తుప్పు పట్టి పనికి రాకుండా పోతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రభుత్వం సొమ్ము వృథా కాకుండా పాఠశాలలో జరుగుతున్న అభివృద్ధి పనులకు ఇనుప కడ్డీలను వాడుకోవాలని పలువురు కోరుతున్నారు. – గడివేముల